# ప్రైవేటు వైద్య విద్య రుసుములపై పరిమితులొద్దు

- 60% సీట్లను యాజమాన్యాల స్వేచ్ఛకే వదిలేయాలి
- లాభదాయక సంస్థలనూ వైద్య విద్యారంగంలోకి అనుమతించాలి
- ఎంసీఐ స్థానంలో జాతీయ వైద్య సంఘం ఏర్పాటు చేయాలి
- నీతి ఆయోగ్ మధ్యంతర నివేదిక సిఫార్సు

ఈనాడు, దిల్లీ: దేశంలో వైద్య విద్యను ఇప్పటి వరకు నియంత్రిస్తూ వస్తున్న జాతీయ వైద్య మండలి(ఎంసీఐ)ని రద్దు చేయాలని నీతి ఆయోగ్ సిఫార్సు చేసింది. దాని స్థానంలో కొత్తగా జాతీయ వైద్య సంఘం (నేషనల్ మెడికల్ కమిషన్) ఏర్పాటు చేయాలని సూచించింది. ఎంసీఐ చట్టం-1956ను సమీక్షించి, అందులో చేపట్టాల్సిన సంస్కరణల గురించి సిఫార్సు చేయడానికి నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగరియా నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 28న కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో ప్రధానమంత్రి అదనపు ముఖ్యకార్యదర్శి పీకే మిశ్ర, నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్‌కాంత్ సభ్యులుగా, కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి బీపీశర్మ సమన్వయకర్తగా ఉన్నారు. వైద్య విద్యతో సంబంధం ఉన్న పలువర్గాలతో సంప్రదింపులు జరిపిన మీదట ఈ కమిటీ తాజాగా కేంద్ర ప్రభుత్వానికి మధ్యంతర నివేదికను ఇచ్చింది. ఇందులో ప్రధానంగా ఎంసీఐ చట్టాన్ని రద్దుచేసి జాతీయ వైద్య సంఘం చట్టాన్ని తీసుకురావాలని సిఫార్సు చేసింది. అత్యున్నత వృత్తి నిబద్ధత ప్రమాణాలు, (మిగతా 2లో)

## ప్రైవేటు వైద్య విద్య రుసుములపై పరిమితులొద్దు

(మొదటి పేజీ తరువాయి)

నైపుణ్యం ఉన్న వారిని స్వతంత్ర, పారదర్శక ప్రక్రియ ద్వారా ఎంపిక చేసి 'రెగ్యులేటర్లు'గా నియమించాలని సూచించింది.

నీతి ఆయోగ్ సిఫార్సులివీ..

- నిబంధనల అమలు కోసం కొత్త వ్యవస్థాగత నిర్మాణాన్ని చేపట్టాలి. అందులో.. (1) వైద్య సలహా మండలి ఉండాలి. జాతీయస్థాయిలో వైద్య విద్య తీరుతెన్నులపై సూచనల కోసం మండలిలో రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సభ్యత్వం కల్పించాలి. (2) జాతీయ వైద్య విద్య విధానాన్ని నిర్దేశించే విభాగంగా జాతీయ వైద్య సంఘం పని చేయాలి. (3) ఎంబీబీఎస్, పీజీ వైద్యవిద్య, వైద్యపరమైన మదింపు, రేటింగ్, రిజిస్ట్రేషన్, నైతిక విలువల కోసం నాలుగు వేర్వేరు స్వతంత్ర ప్రతిపత్తిగల మండళ్లు ఏర్పాటు చేయాలి.
- వైద్య విద్యా సంస్థల పనితీరు విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలిసేలా రేటింగ్స్‌ను ప్రచురించాలి.

ప్రైవేటు వైద్య కళాశాలల్లో రుసుముల నియంత్రణపై ఏం చెప్పింది..

- రుసుములపై నియంత్రణ విధిస్తే కొత్త కళాశాలలు రానందువల్ల వైద్యవిద్య వేగంగా విస్తరించాలన్న ప్రభుత్వ ఉద్దేశం దెబ్బతింటుంది. నియంత్రణ విధించినా, అమలు అనుమానాస్పదమే. ఇది కేపిటేషన్ ఫీజు పేరుతో నల్లధనం ప్రోత్సాహానికి దారితీస్తోంది. ఇతరత్రా పేర్లతో విద్యార్థుల నుంచి ఏదో ఒక రూపంలో రుసుముల వసూలుకు కారణమవుతోంది.
- రుసుముల నియంత్రణకు సుప్రీంకోర్టు, రాష్ట్రస్థాయిలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో తాత్కాలిక ఏర్పాట్లు చేసినా అడ్డదారిలో తీసుకొనే కేపిటేషన్ ఫీజు, ఇతర పేర్లతో వసూలు చేసే రుసుముల నియంత్రణలో ఈ వ్యవస్థ విఫలమైంది.
- పారదర్శకమైన కొత్త వ్యవస్థను తీసుకొస్తే ప్రైవేటు వైద్య కళాశాలల రుసుముల్ని నియంత్రించాల్సిన అవసరం ఉండదు. అప్పుడు ప్రైవేటు కళాశాలలన్నీ బోధనా రుసుముతోపాటు, ఇతర రుసుముల్నీ పారదర్శకంగా అంతర్జాల వెబ్‌సైట్‌లో పేర్కొనాల్సి వస్తుంది.
- ప్రైవేటు వైద్య కళాశాలల్లో గరిష్ఠంగా 40% సీట్ల రుసుముల్ని మాత్రమే నియంత్రించే అధికారాన్ని జాతీయ వైద్య సంఘానికి అప్పగించాలి. మిగిలిన సీట్ల రుసుముల వసూలును కళాశాలలకే వదిలేయాలి. దీనివల్ల ధనిక విద్యార్థుల నుంచి వసూలు చేసిన సొమ్ము పేద విద్యార్థులకు ఉపయోగించడం (క్రాస్‌సబ్సిడీ) సాధ్యమవుతుంది.
- ప్రస్తుత నిబంధనల ప్రకారం కేవలం లాభాపేక్షేతర సంస్థల్ని మాత్రమే వైద్య కళాశాలల ఏర్పాటుకు అనుమతిస్తున్నారు. దీనివల్ల అవి చట్టవిరుద్ధ మార్గాల్లో లాభార్జనకు యత్నిస్తున్నాయి. ఈ నియంత్రణను కొనసాగిస్తే మరిన్ని దుష్పరిణామాలకు దారితీసే అవకాశం ఉంది. కాబట్టి లాభాపేక్షతో ముందుకొచ్చే వారికీ కళాశాలలు ఏర్పాటు చేసుకొనే అవకాశం ఇవ్వాలి. ఇందుకోసం కొత్త జాతీయ వైద్య సంఘం చట్టంలో తగిన నిబంధనలు రూపొందించాలి.

ఈనాడు
THE HEART AND SOUL OF ANDHRA PRADESH

Article Published in
11 August 2016